క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



తిరుపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

గడివేముల: మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో ఇండస్ గుండె ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి డాక్టర్లు మురళీకృష్ణ రమేష్, తనూజ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొమ్మన నరసింహా రెడ్డి, వెంకటశివుడు, బీవీఎస్ రాజు పాల్గొన్నారు.

13న హిందూ ధార్మిక సంస్థల సమ్మేళనం



కరపత్రాలను విడుదల చేస్తున్న హిందూ ధార్మిక సంస్థల ప్రముఖులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు పాతబస్తీలో ఈ నెల 13వ తేదీన హిందూ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళ నం ఘనంగా నిర్వహించనున్నట్లు లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రమణ్యం తెలిపారు. తొలి ఏకా దశి సందర్భంగా ఆదివారం లలితా పీఠంలో హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో సమ్మేళనానికి సంబంధించి కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా సమ్మేళనం జరుగుతోందన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్, విశేష సంపర్క రాష్ట్ర ప్రముఖ్ టి.ప్రాపరెడ్డి మాట్లాడు తూ.. హిందూ సమాజ సంఘటన కోసం హిందుత్వ మార్గదర్శకతపై అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూ ధార్మిక సంస్థల ప్రముఖులు, విశ్వహిందూ పరిషత్ విశేష సంపర్క ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రముఖ్ నీలి నరసింహ, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు రామాంజనేయులు, గురుస్వామి, లక్ష్మీరెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాసులు, చంద్రశేఖరప్ప, సతీష్‌రెడ్డి, మంజునాథ్, చంద్రమోహన్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి



ఆటోలకు కరపత్రాలను అతికిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కర్నూలు(న్యూటౌన్): కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్‌లు, రవాణా రంగ చట్టాల్లో మార్పులను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆటో కార్మికులు పాల్గొనవలసిందిగా కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఆటోల బంద్ జయప్రదానికై ఆదివారం రాజ్‌విహార్ సెంటర్‌లో కరపత్రాలను విడుదల చేసి ఆటోలకు అతికించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘం నగర కార్యదర్శి కృష్ణారెడ్డి, ఏఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే మోటార్ వాహన చట్టం 2021, భారత న్యాయ సంహిత సెక్షన్ 106 (1, 2)లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 10 కోట్ల మంది రవాణా రంగ కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు, ప్రభుత్వమే యాప్‌ను నడపాలన్నారు. లైసెన్స్, రెన్యూవల్, రిజిస్ట్రేషన్, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఆర్టీఓ కార్యాలయం ద్వారా జరగాలని కోరారు. చిన్నటేకూరు వద్ద ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్లను రద్దు చేయాలన్నారు. ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నగర కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణ, జయన్న, జయరాంరెడ్డి, వెంగళరావు, శివకృష్ణ, శ్రీను, ముర్తుజా, జశ్వంత్, త్యాగరాజు పాల్గొన్నారు.

మద్దిలేటిస్వామి ఆలయంలో విశేష పూజలు



స్వామివారికి మహా మంగళహారతి ఇస్తున్న అర్చకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, మహా మంగళహారతి నిర్వహించారు. ఆదివారం నుంచి నాలుగు నెలల పాటు కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగ నిద్రలోకి వెళ్లే క్రమంలో ఆలయంలో శయన భంగిమలో స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుంచి పూజలు చేశారు.

జనసంద్రం.. పీర్ల జలధి ఉత్సవం



పెసరవాయిలో జలధికి తరలుతున్న పీర్లస్వాములు



వెంకటగిరిలో పీర్లస్వాములను ఊరేగిస్తున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. సాయంత్రం నుంచే భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. పీర్లకు రంగురంగుల దుస్తులు, పూలతో అందంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ముఖ్యంగా పెసరవాయి, బూజునూరు, కరిమద్దెల గ్రామాల్లో పీర్ల వేడుకలను చూసేందుకు వేలాది మంది భక్తులు రావడంతో గ్రామాలు జనసంద్రంగా మారాయి. మేళతాళాల మధ్య పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు దారిపొడువునా నీళ్లుపోసి, చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లు జలధికి తరలాయి. మొహర్రం సందర్భంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాణ్యం: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిమజ్జనం సందర్భంగా పీర్లను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. తెల్లవారుజామున అల్వార్ స్వామి వారితో సహా మిగతా పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ఫతేహాల అనంతరం గ్రామంలో ఊరేగించారు. మహిళలు, పెద్దఎత్తున పాల్గొని చక్కెర చదివింపులు, పూలసుసికేములు, నూతన వస్త్రాలు అందించి ముక్కులు తీర్చుకున్నారు. ఉదయం 8 గంటలకు ఆయా చావిడిలో పీర్లు కొలువుదీరాయి. సాయంత్రం పీర్లను నిమజ్జనానికి తరలించారు. యువకులు నృత్యాలు చేస్తూ, రంగులు చల్లుకుంటూ ఆనందం పంచుకున్నారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు వేడుకలు

కోడుమూరు రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పెద్ద సరిగెత్తు వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పెద్ద సరిగెత్తు సందర్భంగా గ్రామాల్లోని ఆయా పీర్లచావిళ్లలో కొలువుదీరిన పీర్లస్వాములకు ప్రత్యేక చదివింపులు చదివించారు. ఆయా పీర్లచావిళ్ల ముందు అగ్నిగుండాలను వెలిగించి యువకులు సాహోసేస్ ఆడారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పీర్లదేవుళ్లు ఏటికి వెళ్లడంతో మండలంలో మొహర్రం ఉత్సవాలు ముగుస్తాయని కోడుమూరు కోటవీధి పీర్లచావిడి నిర్వాహకుడు నాయబ్ ఖాజామోద్దీన్ తెలిపారు. ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంతంగా జరుపుకోవాలని కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి సూచించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కోడుమూరులో పీర్లకు చదివింపులు



పాణ్యంలో అల్వార్‌స్వామి ఊరేగింపు



పీర్లను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

ప్రశాంతంగా జరుపుకోవాలి



సూచనలు ఇస్తున్న ఎస్ఐ పరమేష్‌నాయక్

సి.బెళగల్: మొహర్రం వేడుకలను మండల ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సి.బెళగల్ ఎస్ఐ పరమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడీల వద్ద పోలీస్ బందోబస్త్‌ను పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో పాటు నిర్వాహకులు, ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, నేరాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు పెద్ద సరిగెస్తు నిర్వహించారు. ఆదివారం రాత్రి భక్తులు పీర్ల చావిడీలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సుంతానమ్మ దర్గాను నిర్వాహకులు సుందరంగా అలంకరించారు.



సి.బెళగల్: పెద్ద సరిగెత్తుకు సిద్ధమైన సుంతానమ్మ దర్గా



సి.బెళగల్: పెద్ద ఖాసీం పీర్లు

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

కోడుమూరు రూరల్: అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో తల్లడిల్లుతున్న రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య విమర్శించారు. సీపీఐ నియోజకవర్గ మహాసభలను ఆదివారం కోడుమూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. గిడ్డయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు, కార్మికులు, వ్యవసాయ కూలీలకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసం చేశారన్నారు. ముఖ్యంగా రైతులకు ఏటా ఇస్తామన్న రైతు భరోసాను ఇంతవరకు అమలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా రైతులు, కార్మికుల సంక్షేమానికి కృషి చేయా లని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు క్రిష్ణ, రాజు, చిన్న రాముడు, శేషకుమార్, సులోచనమ్మ, మధు, భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వైఎస్సార్‌సీపీ సమావేశానికి తరలిరండి



సమావేశ ఏర్పాట్లపై పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: కోడుమూరులో సోమవారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశానికి ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం సమావేశం జరగనున్న కోడుమూరులోని స్నేహ వినాయక కల్యాణ మండపాన్ని జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడుతో కలిసి పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ.మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు.

విజయవంతం చేద్దాం

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశానికి మండలంలోని పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 10 గంటలకు కోడుమూరులోని స్నేహ వినాయక ఫంక్షన్ హాల్‌లో సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఇతర నియోజకవర్గ స్థాయి నాయకులు హాజరవుతారని తెలిపారు.

పల్లె సీమల జీవనాడి జానపదం



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): జానపద గీతాలు, సంగీతం పల్లె సీమల ప్రజల జీవనాడి అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. వారం వారం సంస్కృతంలో భాగంగా ఆదివారం రాత్రి తెలంగాణ, రాయలసీమ జానపద కళాకారులచే సంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంలో పాల్గొన్న జానపద కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా పత్తిఓబులయ్య మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం టీజీవీ కళాక్షేత్రంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని, కుటుంబ సమేతంగా నగర ప్రజలు వచ్చి ప్రదర్శనను చూసి ఆనందించాలని కోరారు. ఇప్పటికీ పల్లెటూర్లలో పాట పద్యానికి విపరీతమైన ఆదరణ ఉందన్నారు. ఈ కార్యక్రమానికి మహమ్మద్‌మియ్యా, ఇనాయతుల్లా వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. బీసీ సంఘం నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు దస్తగిరి, రిటైర్డ్ సీఐ సత్యం, వైస్ ప్రెసిడెంట్ సివిరెడ్డి, మున్సిపల్ మేనేజర్ చిన్నరాముడు, కేవీ రమణ పాల్గొన్నారు. అనంతరం జానపద కళాకారులు ఆలూరి రాజా, అఖిల విష్ణు, నరసింహులు, మహేందర్, గంగాధర్‌లను టీజీవీ కళాక్షేత్రం తరపున సత్కరించి పారితోషికం రూ.35 వేలు అందజేశారు. ఆటపాటలతో జానపద వేషధారణలో కళాకారులు పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు.

ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు

పాణ్యం: జూనోసిస్ డే సందర్భంగా మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఆదివారం కుక్కలు, ఇతర జంతువులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లను ఉచితంగా వేసినట్లు పశుసంవర్ధక శాఖ ఏడీఏ కమలాకర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. శాస్త్రవేత్త లూయీ పాశ్చర్ యాంటీరాబిస్ వ్యాక్సిన్‌ను 1885 సంవత్సరంలో కనుగొన్నారన్నారు. అన్ని జంతువుల నుంచి మనిషికి 150పైగా వ్యాధులు సంక్రమిస్తాయని, వీటిని నివారించాలంటే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలన్నారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ వ్యాక్సిన్‌ను తప్పక చేయించాలన్నారు. సిబ్బంది సౌమ్య, పూజిత, ఉపేంద్ర, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం'

కల్లూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిద్దామని సీపీఎం నగర నాయకులు యేసు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్‌లో స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 14న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు మౌలాలి, ప్రభాకర్, గోవిందు, నూర్ బాషా, కేవీపీఎస్ నాయకులు పెద్ద మధు తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు హాజరుకావాల్సిందే

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డుపై నిలిచిన నీరు



వీకర్‌సెక్షన్ కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

కల్లూరు: కల్లూరు అర్బన్ వీకర్ సెక్షన్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రోడ్డు మధ్యలో నీరు నిలిచింది. దీంతో రోడ్డు సైడ్లకు బురద మయంగా మారుతోంది. రోడ్డుపై నిలిచిన నీరు దోమలు, లార్వాలు, ఈగలకు నెలవుగా మారిందని స్థానికులు వాపోతున్నారు. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్



బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు, దేశ మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కర్నూలు నగరంలోని ఆర్‌ఎస్ రోడ్డు సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని విధాలుగా ప్రగతివైపు నడిపించిన గొప్ప నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్ అన్నారు. నేడు కూటమి పాలనలో ప్రతిరోజు బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, వారికి అండగా నిలుస్తున్న నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ మద్దయ్య, ధనుంజయ ఆచారి, లక్ష్మీకాంత్, రాజు, మద్దిలేటి, నాగరాజు, తిమ్మన్న,సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

పీర్ల స్వాములను దర్శించుకున్న కాటసాని

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో కొలువైన డాలు స్వామి, పెద్ద ఖాశీం స్వామి, మౌలాలి స్వామి, గోకారి పీర్లను వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. పీర్ల స్వాములకు చక్కెర, పాతేహాలు సమర్పించారు. పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణ రెడ్డి, నాయకులు పుల్లయ్య, డాలుస్వామి, మహేశ్వర రెడ్డి, శ్రీనివాస రెడ్డి, కాలు నాయక్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

పాణ్యం: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బుజ్జిరెడ్డి తల్లి వై.సావిత్రమ్మ (73) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాణ్యంకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



లక్ష్మీవేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మహిళలు



సి.బెళగల్‌లో పూజలందుకుంటున్న రంగనాథస్వామి



ప్రత్యేక అలంకరణలో వీరనారాయణస్వామి

కోడుమూరు రూరల్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం కోడుమూరులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. పట్టణానికి చెందిన మహిళలు స్వామివారికి ప్రత్యేక పూజలు, దీపాలు వెలిగించి కుంకుమార్చన చేశారు.

సి.బెళగల్: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం సి.బెళగల్ మండలంలో ఉన్న వివిధ ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షలతో ఆలయాలకు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని రంగనాథుడు ఆలయం (సి.బెళగల్), ఈశ్వరాలయం (బస్టాండ్), శ్రీరాజరాజేశ్వరి ఆలయం (కోట వీధి), శ్రీకోన వేంకటేశ్వర స్వామి ఆలయం (క్రిష్ణదొడ్డి), శ్రీచెన్న సోమేశ్వర స్వామి ఆలయం (పోలకల్)లలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఆలయంలోనూ స్వామివారి అలంకారం, అభిషేకాలు, అర్చనలు ఘనంగా సాగాయి. గ్రామాల ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై పూజలు నిర్వహించడంతో ఆలయాల పరిసరాలు భక్తుల సందడితో మార్మోగాయి.



వాల్మీకి రామాలయంలో విష్ణుసహస్ర నామ పారాయణం చేస్తున్న భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి

పాణ్యం: మండలంలో తొలి ఏకాదశి పురస్కరించుకొని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఉపవాసాలతో ఆలయానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. పాణ్యంలోని దేవదాయ శాఖ పరిధిలో ఉన్న వీరనారాయణస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూల అలంకరణ, తులసిమాల అలంకరణ తదితర పూజలు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆర్టీ'ఛీ' బస్టాండ్



మలుపులో గుంత.. జర జాగ్రత్త అన్న



గుంతలమయంగా మారిన రాజ్‌విహార్ ఆర్టీసీ బస్టాండు

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని రాజ్‌విహార్ సెంటర్‌లో ఉన్న పాత ఆర్టీసీ బస్టాండు గుంతలమయంగా మారింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆర్టీసీ బస్టాండులోని మట్టి రోడ్డుపై నీరు నిలవడం, వాటిలోనే బస్సులు తిరుగుతుండడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను మలుపుకునే సమయంలో ప్రమాదం పొంచి ఉంది. మరోవైపు ప్రయాణికులు బురదమట్టి, నీళ్లను దాటి బస్సు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండు ఆవరణలో సీసీ రోడ్డు వేయించి ఇబ్బందులు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండులో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

పందుల స్వైరవిహారం

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా ఎక్కడ పడితే అక్కడ తిరుగుతున్నాయి. వర్షాలు విస్తారంగా పడుతున్న నేపథ్యంలో వైరల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మారెమ్మ గుడి పరిసరాలు, దర్గా మార్గం, ప్రధాన రహదారి పక్కన పందులు స్వేచ్ఛగా సంచరిస్తుండడం గమనార్హం. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో శుభ్రతపై పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పందుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గ్రామంలో ప్రధాన రోడ్డు పక్కన పందుల గుంపు



బోయగేరిలోని డ్రైనేజీ కాలువలో పందులు